పాఠశాలలకు చేరిన విద్యాకానుక సామాగ్రి

ప్రజాశక్తి- సోమల: మండలంలోని ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలకు ప్రభుత్వం అందించిన జగనన్న విద్యాకానుక సామగ్రి సోమల జడ్పీ ఉన్నత పాఠశాలలోని స్టాక్‌పాయింట్ నుంచి పాఠశాలలకు చేరుతున్నాయి. విద్యా కానుకలో భాగంగా పాఠ్యపుస్తకాలు, బ్యాగులు, బూట్లు, సాక్సులు, సమ వస్త్రాలు, నిఘంటువులు తదితర సామాగ్రిని మండల విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది పాఠశాలలకు చేర్చుతున్నారు. మండలంలోని 43 ప్రాథమిక, పది ప్రాథమికోన్నత, ఐదు ఉన్నత పాఠశాలల్లోని 3701 మంది విద్యార్థులకు పాఠశాల తెరవగానే అందజేసేందుకు అన్ని పాఠశాలలకు సామాగ్రిని తరలిస్తున్నారు.

రోడ్డెక్కిన ద్రావిడ ఉద్యోగులు

- నేటి నుంచి రిలే నిరాహార దీక్షలు
- కుప్పంలో ఉద్యోగుల నిరసన ర్యాలీ
- 41వ రోజూ కొనసాగిన సమ్మె

ప్రజాశక్తి- కుప్పం, గుడిపల్లి: ద్రావిడ విశ్వవిద్యాలయంలో తాత్కాలిక ఉద్యోగులగా పని చేస్తున్న 252 మంది తమ రావల్సిన జీతాల కోసం రోడ్డెక్కారు. నాలుగు నెలలు జీతాల కోసం సమ్మె చేస్తున్న ద్రావిడ పొరుగు సేవల ఉద్యోగులు బుధవారం కుప్పం పట్టణం చెరువుకట్ట నుండి బస్టాండ్ వరకు పెద్దఎత్తున నినాదాలు చేస్తూ తమకు పెంచిన నాలుగు నెలల జీతాలు అందించాలని డిమాండ్ చేశారు. అలాగే 12 నెలల అరియర్స్ అందించాలని, సిఎఫ్ ఎం ఎస్ ద్వారా జీతాలు అందించి ఉద్యోగ భద్రత కల్పించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం బస్టాండు ప్రాంగణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి తమ సమస్యలను పరిష్కరించాలంటూ వినతిపత్రాన్ని అందజేసి నిరసనను తెలియజేశారు. ద్రావిడ విశ్వవిద్యాలయంలో 25 ఏళ్లుగా తాత్కాలిక ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే నాధుడే కరువయ్యారని, ఎంతమంది అధికారులు వచ్చి వెళ్తున్న తమ బాధలను గోడును పట్టించుకునే వాడే లేదని ఆవేదనను వ్యక్తం చేశారు. ప్రస్తుత ద్రావిడ వర్సిటీ అధికారులు సైతం తమకు నాలుగు నెలలుగా జీతాలు అందించకుండా అలసత్వం వహిస్తున్నారని వాపోయారు. ఓపక్క విద్యార్థులకు పరీక్షలు నిర్వహించకుండా, వర్సిటీ పునఃప్రారంభమైన అధికారులు మాత్రం విద్యార్థులను వెనక్కి పంపించాలని, వర్సిటీ అభివద్ధిని కొంటుపడేలా వ్యవహరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును అయినా దష్టిలో ఉంచుకొని వర్సిటీ తాత్కాలిక ఉద్యోగులకు వెంటనే పెంచిన జీతాలను అందించాలని కోరుతున్నారు.

అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న వర్సిటీ బోధనేతర ఉద్యోగులు

నేటి నుంచి రిలే నిరాహార దీక్షలు..

ద్రావిడ వర్సిటీ తాత్కాలిక ఉద్యోగులు సమస్యలు పరిష్కరించడంలో ఏ మాత్రం చొరవ చూపకపోవడంతో గురువారం నుండి వర్సిటీ ఉద్యోగులు రిలే నిరాహార దీక్షలకు పూనుకుంటున్నట్లు వారు తెలిపారు. సమస్యలను పరిష్కరించేంత వరకు సమ్మెను విరమించేది లేదని, ఉద్యమాన్ని మరింత ఉధతం చేస్తామని వారు స్పష్టం చేస్తున్నారు.

వేతన బకాయిలు వెంటనే చెల్లించాలి

పి.చైతన్య, సిఐటియు జిల్లా అధ్యక్షులు



ద్రావిడ యూనివర్సిటీలో పొరుగు సేవల సిబ్బందిగా పనిచేస్తున్న 260 మందికి రావల్సిన నాలుగు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలి. గత 40 రోజులుగా తమ న్యాయమైన కోర్కెలను అంగీకరించాలని సిబ్బంది సమ్మె చేస్తున్నా విశ్వవిద్యాలయ ఉపకులపతి, రిజిస్ట్రార్‌లు ఏమాత్రం పట్టించుకోకపోవడం శోచనీయం. కుప్పం నియోజకవర్గ శాసన సభ్యులు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్సీ భరత్‌లు వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపకపోవడం దారుణం. వర్సిటీ బోధనేతన సిబ్బంది చేస్తున్న ధర్మపోరాటానికి ప్రజాసంఘాలు, రాజకీయ నాయకులు, ఉద్యోగులు అండగా నిలవాలి.

నష్టాలలో మామిడి రైతు

- మండీలో కొనుగోలుకు నిరాకరించిన యజమానులు
- ప్రజలకు ఉచితంగా సరఫరా చేసిన రైతు

ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు : మామిడి కాయల మండీలో ఓ రైతుకు చెందిన మామిడి కాయలు కొనుగోలు చేయకపోవడంతో ప్రజలకు ఉచితంగా సరఫరా చేసిన సంఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు పంచాయతీ మిట్టూరు గ్రామానికి చెందిన ఓ రైతు బుధవారం సుమారు ఒకటిన్నర టన్ను మామిడి కాయలను టాటా ఏస్ వ్యాన్‌లో చిత్తూరులోని మండీలో అమ్మడానికి తీసుకెళ్లాడు. అయితే అక్కడ మండీ వారు ఆ కాయలకు మచ్చలున్నాయని, ఇవి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేయడానికి పనికిరావని, తమకు గిట్టుబాటు కాదని కొనుగోలు చేయమని చెప్పారు. రైతు ఎంత వేడుకున్నా వెనక్కి తీసుకెళ్లిపోవాలని మండిపడ్డారు. దీంతో కష్టపడి పండించిన పంటను ఎక్కడో రోడ్డు పక్కన పారబోయడం ఇష్టం లేని రైతు గంగాధర నెల్లూరులోని ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశాడు. అప్పులు చేసి కంటికిరెప్పలా కాపాడుకున్న పంటకు గిట్టుబాటు ధర లేకపోగా కనీసం కొనుగోలు కూడా చేయడం లేదని రైతు వాపోయాడు.

ఉచితంగా మామిడి కాయలను పంపిణీ చేస్తున్న దృశ్యం

మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన

931 మంది యువతీ, యువకులకు ఉద్యోగావకాశాలు

సమావేశంలో మాట్లాడుతున్న మహాసముద్రం జ్ఞానేంద్ర రెడ్డి

ప్రజాశక్తి- పెనుమూరు: నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగాలు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహాసముద్రం జ్ఞానేంద్ర రెడ్డి అన్నారు. బుధవారం పెనుమూరు మండలం పులిగుండు వద్ద మహాసముద్రం ఫౌండేషన్ అధ్యక్షులు ఎం.దయాసాగర్ రెడ్డి ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంకు వచ్చాక ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నిరుద్యోగ యువతీయువకులకు లక్షలాది ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగిందన్నారు. వివిధ కారణాల చేత ఉద్యోగాలు రాని నిరుద్యోగులకు ఈ జాబ్ మేళా ద్వారా తిరిగి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. వివిధ రాష్ట్రాలకు చెందిన 24 ప్రముఖ కంపెనీలు చేపట్టిన ఈ జాబ్ మేళాకు 3400 మంది నిరుద్యోగ యువతీ యువకులు హాజరయ్యారు. వీరిలో 931 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి దయాసాగర్ రెడ్డి, సురేష్ రెడ్డి, దూది శంకర్, ఎన్.రాజేష్, జెడిటిసి సభ్యులు దొరస్వామి యాదవ్, సింగిల్ విండో అధ్యక్షులు గోవిందరెడ్డి, లయన్స్‌క్లబ్ అధ్యక్షులు విజయకుమార్, కంచర్ల చక్రవర్తి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పొలాల సందర్శన

ఆర్‌బికెలను తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ

ప్రజాశక్తి- గుడిపల్లి: జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ బుధవారం గుడిపల్లి మండలంలోని గుడిపల్లి, చిన్నగొల్లపల్లి రైతు భరోసా కేంద్రాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆర్‌బికె సిబ్బందితో మాట్లాడుతూ సిబ్బంది అందరూ రైతులకు అందుబాటులో ఉంటూ రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం చేపట్టిన అన్నిరకాల పథకాలు అర్హత ఉన్న ప్రతి రైతుకు అందే విధంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన టార్గెట్లు పూర్తి చేయవలసినదిగా కోరారు. అలాగే గుడిపల్లిలోని కాడేపల్లిలో ఉన్న మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్‌ను సందర్శించారు. ఈసంవత్సరం అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ఉంది కాబట్టి చిరుధాన్యాల సాగును ప్రోత్సహించి రైతులు ఆర్థికంగా లబ్ధి పొందే విధంగా రైతులను ప్రోత్సహించి, సిరి ధాన్యాలను పెంచే రైతులు సంఘాలుగా ఏర్పడి చిరుధాన్యాల సాగును పెంచి, దాని నుంచి ప్రాసెసింగ్ చేసి ఉపఉత్పత్తులు కూడా ప్రభుత్వం రైతు ద్వారా అందజేసి మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్లు పొందాలని తెలిపారు. శెట్టిపల్లిలో ప్రకతి వ్యవసాయం ద్వారా పెంచేటటువంటి పొలాలను సందర్శించి రైతులందరూ కూడా ప్రకతి వ్యవసాయాన్ని పెంచి, రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి తమ ఆరోగ్యాన్ని, వాతావరణ ఆరోగ్యాన్ని,నేల ఆరోగ్యాన్ని, కాపాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగరాజు, రైతు భరోసా సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్1 పరీక్షలు : కలెక్టర్



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ఈ నెల 3 నుండి జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్ -1 పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నట్లు కలెక్టర్ కె. వెంకటరమణా రెడ్డి తెలిపారు. జిల్లా కలెక్టర్ ఎస్వీయూ కాలేజీ ఆఫ్ ఆర్ట్స్ (ప్రకాశం భవన్) లో బుధవారం పరీక్షల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ గ్రూప్ 1 పరీక్షలు జూన్ 3వ తేదీ నుండి 10 వ తేది వరకు జరగనున్నాయని, ఆదివారం మినహా ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహణ ఉంటుందని తెలిపారు. ఈ పరీక్షలకు అభ్యర్థులు మొత్తం 577 మంది హాజరు కావాల్సి ఉంది. ఈ నెల 3న 439, 5 న 434, 6 న 434, 7న అభ్యర్థులు 429 మంది హాజరయ్యారని తెలిపారు. కలెక్టర్ పర్యటనలో ఎస్‌డిసి శ్రీనివాసులు, పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ సుమకిరణ్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ మణి వున్నారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణకు పటిష్టచర్యలు

నగర కమిషనర్ జె.అరుణ

అర్బన్ హెల్త్ సెంటర్ సిబ్బందితో మాట్లాడుతున్న నగర కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నగరపాలక సంస్థ పరిధిలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు క్షేత్రస్థాయిలో పటిష్టచర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను నియంత్రించేందుకు దోమలను ఎలా నియంత్రించాలి, ఎలా నివారించాలనే అంశాలపై జిల్లా మలేరియా విభాగంతో కలసి వార్డు పారిశుద్ధ్య పర్యావరణ కార్యదర్శులు, ఆరోగ్య కార్యదర్శులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. రానున్నది వర్షాకాలం కాబట్టి క్షేత్రస్థాయిలో దోమల నియంత్రణకు ప్రణాళిక రూపొందించి సమర్పించాలన్నారు. ప్రధానంగా వార్డుల వారీగా డ్రైనేజీల్లో పూడికతీత వారం రోజుల్లో పూర్తి చేయాలన్నారు. నీటి నిల్వ ప్రాంతాల గుర్తించి ఆ ప్రాంతాల్లో దోమల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక ఇవ్వాలన్నారు. దోమల వల్ల కలిగే వ్యాధులు, నియంత్రణ, నివారణ చర్యలపై క్షేత్రస్థాయిలో వాలంటీర్లు, స్వయం సహాయకసంఘాల మహిళలు అవగాహన కల్పించాలన్నారు. ఫాగింగ్, స్ప్రేయింగ్ ఎలా చేయాలి? పిచికారి మందులను ఏ మోతాదులో వినియోగించాలి అనే అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు. దోమల నియంత్రణ, తీసుకోవాల్సిన నివారణ చర్యలు, ఫాగింగ్, స్ప్రేయింగ్ చేయడంలో తీసుకోవలసిన మెళకువలపై జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, మలేరియా సబ్‌యూనిట్ అధికారి పీరూసాహెబ్, సానిటరీ ఇన్స్పెక్టర్లు చిన్నయ్య, లోకనాథం, నరసింహ, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో సంక్షేమానికి పెద్దపీట: ఎమ్మెల్యే

గ్రామాల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

ప్రజాశక్తి- వికోట: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గంలోని ప్రతి 'గడప గడపకు అభివద్ధి సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా వైసిపి ప్రభుత్వం ముందుకెళ్తోందని పలమనేరు శాసనసభ్యులు వెంకటేగౌడ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల పరిధిలోని కొంగాటం పంచాయతీ శివుని కుప్పం సచివాలయ పరిధిలో స్థానిక సర్పంచ్ అనిత జయరామిరెడ్డితో కలిసి ప్రతిగడపను సందర్శించారు. గత నాలుగు రోజులుగా ఇదే పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో వారు పర్యటించారు. ఎమ్మెల్యే ప్రతిగడపకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్న తీరుతెన్నులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివద్ధి సంక్షేమపథకాల పట్ల ప్రజలు సంతప్తికరంగా ఉన్నారని దీన్ని జీర్ణించుకోలేని ప్రతిపక్షాలు ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేసి ప్రజలను మభ్యపెట్టడానికి ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. అర్హత ప్రామాణికంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సొంత ఇంటిని మంజూరు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ యువరాజ్, రాస్కో మాజీ చైర్మన్ ఆర్‌హెచ్ జయరాం రెడ్డి ఎంపిటిసిలు కమల్, సమద్, తోపాటు నేతలు ప్రతాప్ రెడ్డి, కష్ణమూర్తి, అధికారులు పాల్గొన్నారు.

ముంబాయిలో 'బాలాజీ' ఆలయ నిర్మాణానికి భూమిపూజ

ఖర్చు మొత్తం భరించనున్న రేమండ్ గ్రూప్ సిఎండి

ప్రజాశక్తి - తిరుమల: మహారాష్ట్ర ప్రజల చిరకాల కోరికను నెరవేర్చి మనల్ని ఆశీర్వదించడానికి తిరుమల బాలాజి నవీ ముంబాయి లో కొలువుదీర బోతున్నారని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్ నాథ్ షిండే సంతోషం వ్యక్తం చేశారు. నవీ ముంబైలోని ఉల్వేలో మహా రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన 10 ఎకరాల స్థలంలో శ్రీవేంక టేశ్వర (బాలాజి) ఆలయ నిర్మాణానికి బుధవారం శాస్త్రోక్తంగా భూమి పూజ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య మంత్రి ఏక్ నాథ్ షిండేతో పాటు, డెప్యూటీ సిఎం దేవేందర్ ఫడ్నవీస్ పాల్గొన్నారు. ముఖ్యమంత్రి షిండే ఆలయ విశేషాలను మీడియా ప్రతినిధులకు వివరించారు. "వెంకటరమణ గోవిందా" అంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. నవీ ముంబైలో తిరుపతి బాలాజి మందిర నిర్మాణానికి శంఖు స్థాపన జరిగిన ఈ రోజు మహారాష్ట్రకు మరపురాని రోజు అన్నారు. తిరుమలలో బాలాజిని దర్శించుకునే అదష్టం అందరికీ ఉండదన్నారు. రాబోయే రోజుల్లో ముంబైలోనే శ్రీ బాలాజి (వేంకటేశ్వరుని) దర్శనం చేసుకునే అదష్టం మహారాష్ట్ర ప్రజలకు లభించబోతోందని చెప్పారు. ముంబై ట్రాన్స్ హార్బర్ లింక్‌లోని 22 కిలోమీటర్ల పొడవైన సింగిల్ బ్రిడ్జి త్వరలో మహాలక్ష్మి ఆలయానికి అనుసంధానించబడుతోందన్నారు. ఈ పనులన్నీ శ్రీ బాలాజి ఆశీర్వాదంతో జరుగుతున్నాయన్నారు. నవీ ముంబైలోని శ్రీ బాలాజి ఆలయ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయడానికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని సిఎం చెప్పారు. టీటీడీ బోర్డు చైర్మన్, సభ్యులు, అధికారులు, దాతలు, మహారాష్ట్ర ప్రభుత్వ అధికారులతో పాటు ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ మహారాష్ట్ర ప్రజల చిరకాల వాంఛ అయిన బాలాజి ఆలయాన్ని తిరుమల ఆలయం తరహాలో నిర్మించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సూచించారన్నారు. ఇందుకు అవసరమైన ఆలయ నిర్మాణ ప్రణాళిక సిద్ధంగా ఉందని ఆయన చెప్పారు. ఆలయ నిర్మాణం ఖర్చు మొత్తం భరించడానికి రేమండ్ గ్రూప్ సిఎండి గౌతమ్ హరి సింఘానియా ముందుకు వచ్చారని వివరించారు. రెండేళ్ళలో ఆలయ నిర్మాణం పూర్తి చేసి భక్తులకు స్వామి వారి దర్శనం కల్పిస్తామని చెప్పారు. గౌతమ్ సింఘానియా మాట్లాడుతూ ఇది తనకు చాలా సంతోషకరమైన రోజని చెప్పారు. తాను ఐదు దశాబ్దాలుగా తిరుమల బాలాజిని దర్శిస్తున్నానని చెప్పారు. ముంబైలో శ్రీ బాలాజి ఆలయాన్ని నిర్మించే అదష్టం స్వామి తనకు ఇచ్చినందుకు కతజ్ఞతలు తెలిపారు. ఈ ఆలయం మహారాష్ట్ర ప్రజలకు ఎంతో ఆధ్యాత్మిక ఆనందం పంచుతుందని ఆయన చెప్పారు. అందరి సహకారంతో ఆలయాన్ని అత్యంత వేగంగా నిర్మిస్తామన్నారు. టీటీడీ ఈవో ఎవి ధర్మా రెడ్డి, బోర్డు సభ్యులు మిలింద్ నర్వేకర్ , అమోల్ కాలే, రాజేష్ శర్మ, సౌరభ్ బోరా పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: 2014 జూన్ 2 నాటికి ఐదు సంవత్సరాలు నిండిన కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ కేబినెట్ నిర్ణయం వేలాది మంది ఉద్యోగులను తీవ్ర నిరాశకు గురి చేసిందని కాంట్రాక్టు ఉద్యోగులు, కార్మికులందరినీ రెగ్యులరైజ్ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థలు, యూనివర్సిటీ, ఎండోమెంట్‌లలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేస్తామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 2019 ఎన్నికల ప్రణాళికలో వాగ్దానం చేసిందని ఇచ్చిన హామీ ప్రకారం రెగ్యులరైజ్ చేయాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేస్తోందన్నారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ సమాన పనికి సమాన వేతనం అమలు చేస్తానన్న హామీని కూడా వెంటనే అమలు చేయాలన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు కూడా రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పని చేస్తున్నందున వారి సర్వీసును పరిగణించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. దాదాపు 25 సంవత్సరాలుగా పనిచేస్తున్నా టైంస్కేల్, ఎన్ఎంఆర్, డైలీవేజ్, కంటింజెంట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని సిపిఎం డిమాండ్ చేస్తున్నదని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 60వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులు పనిచేస్తున్నారని వీరిని సకాలంలో రెగ్యులరైజ్ చేయకపోవడం వలన కొంతమంది ఇటీవల కాలంలో రిటైర్ అవుతున్నారని తెలిపారు. జూన్ 2, 2014కు 5 సంవత్సరాల సర్వీసు పూర్తిచేసిన వారినే రెగ్యులర్ చేస్తామన్న నిబంధన సరైంది కాదని, ఈ నిబంధన వలన జిల్లాలో కేవలం వందల్లో మాత్రమే రెగ్యులర్ అవుతారని తెలిపారు. ఎన్నికల సమయంలో, మేనిఫెస్టోలో కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేస్తామని వైసిపి ప్రభుత్వం హామీకి భిన్నంగా నేటి కేబినెట్ నిర్ణయం ఉందన్నారు. కనుక ప్రస్తుతం పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా పోకుండా ఉద్యోగ, ఉపాధ్యాయ, కాంట్రాక్టు ఉద్యోగ సంఘాలతో చర్చలు జరపాలని కోరారు.

తిరుమల కొండపై మరో వివాదం

కొండపై ఆదిపురుష్ హీరోయిన్‌ను ఆలింగనం చేసుకోవడంపై విమర్శలు

ప్రజాశక్తి - తిరుమల: ప్రభాస్, కృతి సనన్ కాంబినేషన్లో తెరకెక్కిన సినిమా ఆదిపురుష్. ఓం రౌత్ డైరెక్ట్ చేసిన ఈసినిమా ప్రీరిలీజ్ ఈవెంట్ మంగళవారం తిరుపతిలో ఘనంగా జరిగింది. అయితే మంగళవారం ఉదయాన్నే తిరుమల శ్రీవారిని ఆదిపురుష్ టీమ్ దర్శించుకుంది. ఈ టీమ్‌లో కృతి సనన్ మిస్ అయ్యింది. ఇక ఈ ఈవెంట్ కంప్లీట్ అవ్వగానే మంగళవారం రాత్రి తిరుమలలో బసచేసిన హీరోయిన్ కృతిసనన్ మరుసటి రోజు ఉదయాన్నే బుధవారం శ్రీవారి దర్శనం చేసుకుంది. కృతీతో పాటు.. డైరెక్టర్ ఓం రౌత్ ఇతర టీమ్ కొంత మంది కూడా దర్శనంలో పాల్గొన్నారు. అయితే దర్శనం తరువాత ఆదిపురుష్ దర్శకుడు ఓం రౌత్ చేసిన పని ఇప్పుడు వివాదాస్పదమయ్యింది. ఉదయం తిరుమల శ్రీవారిని వీరు దర్శించుకున్నారు. అనంతరం గుడి వెలుపల కతి సనన్‌కు సెండాఫ్ ఇచ్చాడు ఓం రౌత్. అయితే ఈ క్రమంలో ముద్దు పెట్టుకుని, హత్తుకున్నారు. ఆ తర్వాత కతి కారెక్కి వెళ్లిపోయారు. అలా తిరుమలలో.. శ్రీవారి ఆశీర్వాదం చేసిన శేష వస్త్రాలు అలా వంటిపై ఉండగానే ముద్దులు, హగ్గులు కనిపించడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతే కాదు ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో.. నెటిజన్లు ఓం రౌత్ పై మండిపడుతున్నారు. తిరుమలలో దేవుడి సన్నిదిలో ఈ గలీజ్ పనులేంటంటూ మండిపడుతున్నారు. అంతే కాదు ఈ వివాదం పొలిటికల్ టర్న్ తీసుకుంది. ఈ విషయంలో బీజేపీ నేతలు ఘాటుగా స్పందించారు. తిరుమల ఒక ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమని, ఇది పిక్నిక్ స్పాట్, షూటింగ్ స్పాట్ కాదని వారికి వార్నింగ్ ఇచ్చారు. స్వామివారి అర్చన సేవలో పాల్గొని ఆలయం నుంచి బయటకు వచ్చిన తర్వాత ఆలయ మహాద్వారం ముందు ఇలాంటి పని చేయడాన్ని తాము ఖండిస్తున్నామని చెప్పారు. ఇలాంటి పని చేసినందకు ఓం రౌత్ తో పాటు కతీసనన్ కూడా బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మీ కల్చర్ ఏదైనా కావచ్చు.. కాని దేవుడి సన్నిధిలో మాత్రం ఇది ఎంత మాత్రం సరికాదని అన్నారు. మరోవైపు ఈ విషయంలో ఆదిపురుష్ టీమ్ వాదన వేరే విధంగా ఉంది. కతి సనన్ కు ఫ్లైట్ టైమ్ అవుతోందని, ఆమె హడావుడిగా బయల్దేరేందుకు రెడీ అవ్వడంతో.. ఆమెకు సెండాఫ్ ఇచ్చే క్రమంలో డైరెక్టర్ ఇలా చేశారని.. కాని ఇందులో తప్పుడు ఉద్దేశ్యం కాని..అసభ్యత కానీ లేదని అంటున్నారు.

సిఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-సోమల: మండలానికి చెందిన ముగ్గురు వ్యక్తులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆర్థిక సహాయ చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. నంజంపేట గ్రామానికి చెందిన నగేష్‌బాబు గుండె జబ్బుతో ఇబ్బంది పడుతుండగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దష్టికి తీసుకువెళ్లగా ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి లక్ష 15 వేల రూపాయలను మంజూరు చేశారు. ఈ సందర్భంగా చెక్కును కుటుంబ సభ్యులకు సర్పంచ్ వెంకటరెడ్డి అందజేశారు. అలాగే నెల్లిమంద పంచాయతీకి చెందిన అమాస రామకష్ణయ్య యాక్సిడెంట్ అయ్యి తీవ్రగాయాలు కావడంతో చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి లక్ష 40 వేల రూపాయల ఆర్థిక సహాయ చెక్కును మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు పంపిణీ చేశారు. ప్రమాదంలో గాయపడ్డ నంజంపేట గ్రామానికి చెందిన కోటేశ్వరరావు అనే యువకుడికి వైద్య ఖర్చుల నిమిత్తం 65 వేల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును ఎంపీపీ ఈశ్వరయ్య ,వైస్ ఎంపీపీ ప్రభాకర పంపిణీ చేశారు.

నేడు భవన నిర్మాణాలకు భూమిపూజ

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రమైన సదుంలో రెండు కోట్ల రూపాయల నిధులతో నూతనంగా నిర్మించ తలపెట్టిన పాలిటెక్నిక్ కళాశాల భవన నిర్మాణ పనులకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నేడు గురువారం ఉదయం 7:30 గంటలకు భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారని జడ్పిటిసి సోమశేఖర రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, గహసారథుల మండల కన్వీనర్ ప్రకాష్ రెడ్డి తెలిపారు. అలాగే గార్గేయ నదిపై నూతనంగా కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన బ్రిడ్జి (ఫ్లైఓవర్) ప్రారంభోత్సవం, బ్రిడ్జి పైన ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాల ప్రారంభోత్సవం కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

సొంత భవనంలోకి 'సచివాలయం 2'

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రమైన సోమల శివాలయం వద్దనున్న కమ్యూనిటీ హాలులో నడుస్తున్న సోమల 2 సచివాలయం గురువారం నుండి ఎంపీడీవో కార్యాలయ సమీపంలోని సొంత సచివాలయం భవనంలోకి మార్చినట్టు పంచాయతీ కార్యదర్శి దివ్యభారతి తెలిపారు. ఈ మార్పును సచివాలయ పరిధిలోని గ్రామాల ప్రజలు గుర్తించాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శివాలయం వద్ద ఎన్ని రోజులు ప్రజలకు అన్నివిధాల సేవలు అందజేయడం జరిగిందని, ఇకపై అదే విధమైన సేవలను నూతన భవనంలో కూడా ప్రజలకు అందజేయనున్నట్టు తెలిపారు. ఈ మార్పును గుర్తించి ప్రజలు సమస్యలు ఏమైనా ఉన్నా, ధ్రువపత్రాలు కావల్సిన వారు నూతన సచివాలయం వద్దకు తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని కోరారు.

పొంచి ఉన్న ప్రమాదం

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని కంభంపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న దాసర్లపల్లి ఎస్సీకాలనీలోని విద్యుత్ స్తంభానికి ఉన్న కరెంట్ తీగలకు పిచ్చి మొక్కలు అల్లుకుపోయాయి. వాటి ద్వారా విద్యుత్ సరఫరా కిందకు పాకుతున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఎవరైనా పొరపాటున చెట్టును తాకితే ప్రమాదం జరుగుతుందని భయాందోళనకు గురి అవుతున్నారు. దీనికి తోడు విద్యుత్ స్తంభానికి ఉన్న ఎల్ఈడీ బల్బు 30 రోజులుగా వెలగడం లేదు. దీనిపై వాలంటీర్లు, సచివాలయ సిబ్బందికి, లైన్‌మెన్‌కు చెప్పిన నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు ఏ ప్రమాదం జరుగక ముందే చర్యలు తీసుకోవాలని ఎస్సీ కాలనీ వాసులు కోరుతున్నారు.

ఘనంగా గంగ జాతర చాటింపు

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రమైన సోమలలో గంగ జాతర సందర్భంగా మంగళవారం అర్ధరాత్రి పురవీధులలో జాతర చాటింపును వేశారు. గ్రామపెద్దలు, గ్రామస్తులు గ్రామచావిడి వద్ద చేరి గంగ జాతర చాటింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈనెల 13వ తేదీ మంగళవారం రాత్రి అమ్మవారి మట్టి విగ్రహాన్ని శివాలయం ఎదురుగా చావిడి వద్ద ప్రతిష్ఠించనున్నారు. 14వ తేదీ బుధవారం ఉదయం అమ్మవారికి నడివీధి పొంగళ్ళు, సాయంత్రం అమ్మవారి నిమజ్జన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

అతిసార నియంత్రణపై అవగాహన

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రమైన సోమల, నెల్లిమంద పంచాయతీ నెల్లిమంద, కమ్మపల్లి గ్రామాలలో అతిసార నియంత్రణ అవగాహన కార్యక్రమాలను వైద్య సిబ్బంది బుధవారం నిర్వహించారు. సోమల వైద్యాధికారి జయసింహ, కందూరు వైద్యాధికారిని విజయ లక్ష్మి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది గ్రామాలలో తీవ్రమైన ఎండలకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. అలాగే ఏదైనా అస్వస్థత కలిగినప్పుడు ఆశా కార్యకర్త ద్వారా ఏఎన్ఎంను సంప్రదించి సరైన సమయంలో చికిత్స పొందడం ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాగడం తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ కుమార్, సూపర్వైజర్ ప్రమీల, ఎమ్మెల్యే హెచ్ పి సింధు, ఏఎన్ఎం భూదేవి పాల్గొన్నారు. సోమల హెల్త్అండ్ వెల్నెస్ సెంటర్‌లో అప్పుడే పుట్టినబిడ్డ నుండి ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు వచ్చే అతిసార నివారణకు తీసుకోవలసిన చర్యలపై చిన్నారుల తల్లులకు, బాలింతలకు పలు రకాల సూచనలను సిహెచ్ఓ అమర్నాథ్, సూపర్వైజర్ రహీమా, ఏఎన్ఎం గీత తెలియజేశారు.

వాలంటీర్లకు సన్మానం

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండల పరిధిలోని పలు సచివాలయాల్లో పని చేస్తున్న వాలంటీర్లకు బుధవారం ఎంపిపి మొగసాల రెడ్డప్ప, ఎంపిడిఓ రాజేంద్ర బాలాజీ అధ్యక్షతన సన్మానించడం జరిగింది. మండలంలోని బైరెడ్డిపల్లి, ధర్మపురి, గంగినాయనపల్లి, దేవదొడ్డి, కమ్మనపల్లి, నెల్లిపట్ల చప్పిడిపల్లి, తీర్థం, గడ్డూరు పంచాయతీ పరిధిలోని సచివాలయాల్లో పనిచేస్తున 145 మంది వాలంటీర్లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అందించే సంక్షేమ పథకాలను నేరుగా అందించడంలో కీలకపాత్ర పోషించిన వాలంటీర్ల సేవలు మరువలేనివని కొనియాడారు. అనంతరం వాలంటీర్లకు సేవారత్న, సేవవజ్రా, సేవామిత్రలుగా గుర్తించి అవార్డులను అందించారు. కార్యక్రమంలో డిడిఓ సదాశివయ్య, రాజశేఖర్ ఆచారి, మహేష్, త్యాగరాజులు, రాధాబాయ్, సర్పంచులు వెంకటేష్, బాలకృష్ణ, రేణుక శంకర్‌రెడ్డి, రాజన్న, చిన్నబుడ్డమ్మ, విజయ, జ్యోతి, శ్రీనివాస్ దేవేంద్ర పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవం చేసుకోవాలి

ప్రజాశక్తి-పాలసముద్రం: మండల పరిధిలోని గర్భిణీలు ప్రసవం ప్రభుత్వ ఆసుపత్రిలోని చేసుకుంటేనే మాతా శిశు మరణాలు తగ్గుతాయని వైద్య అధికారి మోహన్ కష్ణ తెలిపారు. బుధవారం పాలసముద్రం ఆరోగ్య ఉపకేంద్రంలో సూపర్వైజర్ సుశీల, మురళి సమీక్షంలో గర్భిణీలకు ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు. వైద్యపరీక్షకు వచ్చిన గర్భిణీలతో డాక్టర్ మోహన్‌కష్ణ మాట్లాడుతూ గర్భిణీలు తప్పకుండా నెలసరి వైద్యపరీక్షలు చేసుకోవాలన్నారు. ప్రసవం ప్రభుత్వ ఆసుపత్రిలోనే చేసుకుంటే ఉచితంగా జనన సర్టిఫికెట్, మాతాశిశులను స్వేచ్ఛగా ప్రభుత్వ వాహనంలోనే స్వగ్రామానికి చేరుస్తారని తెలిపారు. ఆశా కార్యకర్తలు గర్భిణీలు ప్రసవం వరకు వారికి అందుబాటులోనే ఉండాలని సూచించారు. అనంతరం గర్భిణీలకు, చిన్నారులకు వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

పోషకాహారంతోనే అధిక పాల దిగుబడి

ప్రజాశక్తి-పాలసముద్రం: పోషక విలువ కలిగిన పదార్థాలతోనే పాడి పశువులకు అధిక పాలు దిగుబడి వస్తుందని పశు వైద్యాధికారి యసస్వి తెలిపారు. బుధవారం పాలసముద్రం రైతు భరోసా కేంద్రం ఆవరణలో పాడి పశువులకు ఉచిత వైద్యపరీక్ష నిర్వహించారు. పాడి పశువులకు గాలికుంటు టీకాలు వేయించాలని తెలిపారు. చాలా మంది పాడి రైతులు ఏకాల వేసుకోవడం వల్ల పాల దిగుబడి తగ్గుతుందని వేసుకోవడం లేదని, టీకాలు వేయించడం వల్ల పాలు దిగుబడి తగ్గదని తెలిపారు. పాడి పశువులను రెండు రోజులకు ఒకసారి మంచి నీటితో శుభ్రంగా కడిగి ఉంచాలని తెలిపారు. పాడి పశువు ఆరోగ్యం బాగుంటే పాలలో వెన్న శాతం పెరుగుతుందని సూచించారు. అనంతరం పాడి పశువులకు టీకాలు వేశారు.

వ్యవసాయదారులకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి-యాదమరి: మండల పరిధిలోని జోడి చింతల సింధియా సుచి ఆధ్వర్యంలో వ్యవసాయ దారులకు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. మండల పరిధిలోని కొలమాసనపల్లి రత్న బయోప్లాంట్ సెంటర్‌లో బి.రత్నారెడ్డి ఎండి ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్లాంట్ ఇన్స్పెక్టర్ కె.శంకర్‌రెడ్డి వ్యవసాయ దారులకు వర్మి కంపోస్ట్, రసాయనిక ఎరువులు బదులుగా సేంద్రియ ఎరువులు తయారు చేయడం, డైరీ ఫార్మ్ తేనె తయారీవిధానం, అర్బన్ మెడిసిన్ మౌలిక ఆయుర్వేద మొక్కలు హెర్బల్ క్లినిక్ తదితర కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సింధియా సిబ్బంది థామస్, వరదరాజులు, జాకబ్, ధనలక్ష్మి, రత్న, బయో ప్లాంట్ సిబ్బంది లత పాల్గొన్నారు.

చెత్త రహిత పట్టణంగా మార్చేందుకు కృషి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: చెత్తరహిత పట్టణంగా మార్చేందుకు కృషి చేస్తామని పుత్తూరు పురపాలక సంఘ కమిషనర్ కెఎల్ఎం రెడ్డిపేర్కొన్నారు. బుధవారం మంత్రి ఆర్‌కె రోజా ఆదేశాల మేరకు వివిధ అభివద్ధి పనుల ను చేపట్టడం జరిగింది. అందులో భాగంగా పుత్తూరు పురపాల సంఘ కమిషనర్ పట్టణంలో జరుగుతున్న వివిధ అభివద్ధి పనులను పరిశీలించారు. వాటిలో ముఖ్యంగా కళ్యాణపురంలో ఎప్పటినుంచో ఉన్న తాగునీటి పైపులైన్ సమస్య కు పరిష్కారం దిశగా అడుగులు వేసి దాదాపు రూ.10 లక్షల ఎస్టిమేషన్ కాస్ట్ తో పైప్‌లైన్ వర్క్ మొదలుపెట్టారు. సదరు పైప్ లైన్ పనులకు అయ్యే ఖర్చు మొత్తం రూ.10 లక్షల 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి కేటాయించినట్లు కమిషనర్ తెలిపారు. అనంతరం ఆయన పురపాలక సంఘం ఏఈ తో కలిసి పుత్తూరు, హరిజనవాడలో పైప్ లైన్ పనులను పరిశీలించారు. పరిసీలించడం జరిగినది. హరిజనవాడలో దాదాపు రూ.8. 25 లక్షల ఎస్టిమేషన్ కాస్ట్‌తో పైపులైన్లు వేయడం జరుగుతున్నది. తదనంతరం పురపాలక సంఘం కమిషనర్ గారు గణపతి నగర్‌లో అపరిస్కతంగా ఉన్నటువంటి మురికి కాలువ పనులను పనులను 15వ ఆర్థిక సంఘం నిధులతో దాదాపు 5 లక్షల రూపాయలతో పనులను ప్రారంభించడం జరిగింది. అలాగే ఒంటిమిట్ట ప్రజానీకం మంత్రి రోజా దష్టికి ఒంటిమిట్ట శ్మశాన వాటిక సమస్య తీసుకెళ్లడంతో మంత్రి స్పందించి రెవెన్యూ, పురపాల సంఘం వారు కోఆర్డినేషన్‌తో శ్మశాన వాటికకు దారి ఏర్పాటు చేయుటకు సర్వే నిర్వహించి ఆ సమస్యకు పరిష్కారం చూడవలసిందిగా ఆదేశించారు. ప్రజలు మేము ఇచ్చే సలహాలు, సూచనలు పాటించి పురపాలక సంఘాన్ని చెత్త రహిత పట్టణంగా మార్చేందుకు సహకరించాలని కమిషనర్ కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదాలు జరిగితే అధికారులకు తెలియజేయాలి

ప్రజాశక్తి-గూడూరు: ఏవైనా ప్రకతి విపత్తులు, ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే అధికారులకు తెలియజేయాలని గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్ బుధవారం తెలిపారు. అలా చేయడం వల్ల మీకు న్యాయం చేసేలా చర్యలు చేపడతామని ఆయన తెలిపారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ ఉదాహరణకు మంగళవారం మండలంలోని నెలటూరు గ్రామ చెరువులో చేపలు పట్టుటకు వెళ్లిన తుపాకులు చిన్నయ్య ప్రమాదవశాత్తు చెరువులో పడిపోయారని తిరుమల శెట్టి చందన భర్త వెంకటేశ్వర్లు గూడూరు రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా విషయం తెలుసుకున్న అధికారులు హుటాహుటిన సంఘటనా స్థలానికి వెళ్లి స్టేట్ డిజిటల్ మేనేజ్‌మెంట్, ఆర్డీవోలకు జిల్లా కలెక్టర్ ద్వారా లేఖ పంపి 9వ బెటాలియన్ టీమును గాలింపు చర్యలకు స్టేట్ ఎస్డి ఆర్ఎఫ్ డైరెక్టర్‌కు ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం గూడూరు బయలుదేరారని తెలిపారు. బుధవారం ఎట్టకేలకి గాలించి బాడీని వారికి అప్పగించారని ఆర్డీవో కిరణ్ కుమార్ తెలియజేశారు.

ఆశ్రమంలో భోజనం పంపిణీ

ప్రజాశక్తి-గూడూరు టౌన్: ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ చక్రవర్తి జన్మదినం సందర్భంగా గూడూరు పట్టణంలోని అడవయ్యకాలనీ వద్ద ఉన్న గాడ్ గ్రేస్ సొసైటీ ఆశ్రమంలో నిరుపేదలకు, తిరుపతి జిల్లా వక్ఫ్ బోర్డ్ ఉపాధ్యక్షులు సయ్యద్ అబ్దుల్ గఫూర్ ఆధ్వర్యంలో భోజన పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అబ్దుల్ గఫూర్ మాట్లాడుతూ అందరినీ ఆప్యాయంగా పలకరించే వివాదరహితుడుగా, వైసీపీలో నిబద్ధతతో పనిచేసే మా ప్రియతమ నేత బల్లి కళ్యాణ్ చక్రవర్తికి హదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. ఆయన జన్మదినం పురస్కరించుకుని అనాధాశ్ర మంలో భోజనం పంపిణీ కార్యక్రమం చేపట్టామని అన్నారు. గూడూర్ డివిజన్ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ మెంబర్ కూరపాటి రవీంద్రబాబు మాట్లాడుతూ బల్లి కళ్యాణ్ చక్రవర్తికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని, రాబోయే రోజుల్లో ఆయన మరెన్నో ఉన్నతమైన పదవులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎల్లా దీపురెడ్డి, మదర్ పాల్గొన్నారు. పట్టణంలోని గడియారం స్థంభంవద్ద ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి జన్మదినం సందర్భంగా ఆయన అభిమానులు, నాయకులు కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పేటేటి చంద్రనీల్, నాయకులు వంశీ పాల్గొన్నారు.

తప్పనిసరిగా ఈకేవైసీ చేసుకోవాలి

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: రైతు భరోసా, పీఎం కిసాన్ 14వ విడత డబ్బులు రాని రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేసుకోవాలని వ్యవసాయ అధికారిణి భారతి తెలిపారు. బుధవారం మండలంలోని రైతు భరోసా కేంద్రంలో, అగ్రికల్చర్ కార్యాలయంలో ఈకేవైసీ చే యించుకోని రైతుల జాబితాను సిద్ధం చేసినట్లు ఆమె తెలిపారు. అ నంతరం ఆమె మాట్లాడుతూ ఆ జాబితాలో మీ పేరు ఉంటే సమీ పంలోని రైతు భరోసా కేంద్రం, కామన్ సర్వీస్ సెంటర్, వ్యవసాయ శాఖ కార్యాలయానికి వెళ్లి ఈకేవైసీ చేసుకోవాల్సిందిగా తెలిపారు. ఈకేవైసీ చేసుకుంటే డబ్బులు అకౌంట్లో జమఅవుతాయని చెప్పారు.

కంచన పుత్తూరులో 'ఫ్యామిలీ ఫిజీషియన్'

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని కంచన పుత్తూరు గ్రా మంలో బుధవారం ఉదయం బుచ్చినాయుడు కండ్రిగ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్ పి.వి.దివాకర్ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా 8 మంది గర్భిణులకు, 3 బాలింతలకు బిపి, షుగర్, తదితర పరీక్షలు చేసి ఉచితంగా నెలకు సరిపడా మందులను అందించారు. అనంత రం డాక్టర్ మాట్లాడుతూ పౌష్టికరమైన ఆహారం, ఆకుకూరలు, కాయగూరలు, పాలు, పెరుగు, ఐరన్ మాత్రలు రోజూ క్రమం తప్ప కుండా తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సుబ్రహ్మణ్యం, హేమమాలిని, మీనాక్షి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

'ఉపాధి పని దినాలు పెంచండి'

కూలీల ఆవేదన

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మండలంలోని తీర్థం పంచాయతీ పరిధిలో ఉన్న వెంకటపతి చెరువు వద్ద జరుగుతున్నాయి. దాదాపు 69 మంది కూలీలు పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ తాము సంవత్సరంలో వంద రోజులు ఉపాధి హామీ పనులను చేస్తున్నామని, అయితే ఆ తర్వాత పనులు లేక నానా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన సమయంలో పనులు దొరక్క జీవనోపాధి లేక అవస్థలు పడుతున్నామని ప్రభుత్వం స్పందించి పని దినాలను పెంచాలని కోరారు. పంచాయతీ పరిధిలో వ్యవసాయ పనులు కూడా ఉండటం లేదని తమ బాధలను గుర్తించి వంద రోజుల పనులను 250 రోజులకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఫీల్డ్ అసిస్టెంట్ గణపతి, సర్పంచ్ జ్యోతి శ్రీనివాస్, ఎంపిటిసి రవీంద్రమ్మ తనయుడు కేశవులు పనులను పరిశీలించారు.

'ఇంటి వద్దకే వైద్యం'

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ఇంటి వద్దకే వచ్చి అందించే వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని తుంబకుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు లోహిత్ చెంగల్ రాయలు కోరారు. బుధవారం మండలంలోని కట్టప్పగారిపల్లి. ముంగరమడుగు గ్రామాల్లోని ప్రజలకు వైద్యసేవలను అందించారు. ఈసందర్భంగా గర్భిణులు, బాలింతలు, షుగర్ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు రమేష్, సిహెచ్ఓలు కుమారి, హరిప్రియ, నీరజ, దేవిశ్రీ, మంజుష, ఆరోగ్య కార్యకర్తలు సరిత, వాణి, 104 సిబ్బంది సుబ్రహ్మణ్యం, చక్రపాణి ఆశాలు పాల్గొన్నారు.

పీఆర్సీ, డీఏ బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి-పలమనేరు: ప్రతి నెలా ఒకటో తేదీన పెన్షన్లు చెల్లించాలని, పీఆర్సీ డీఏ బకాయిలు ఒకే వాయిదాలో చెల్లించే విధంగా ప్రభుత్వం చొరవ చూపాలని ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్షులు మనోహర్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని పెన్షనర్ల కార్యాలయంలో పెన్షనర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అడిషనల్ క్వాంటం పొందే వారి బ్యాంకుఖాతా సరిచూసుకోవాలని, ఈ కేవైసీ చేయించుకొని సకాలంలో ఇనకమ్ టాక్స్ ఫైలింగ్ చేసుకోవాలని సూచించారు. పెన్షనర్లు సమస్యలుంటే సకాలంలో తెలియజేసి ఎస్‌టిఓ కార్యాలయంలో సంప్రదించి పరిష్కరించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆసంఘం ఉపాధ్యక్షులు గురుమూర్తి, సహఅధ్యక్షులు రత్నారెడ్డి, కార్యదర్శి వెంకటకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో నాయకులు

ప్రజాశక్తి-పలమనేరు: పట్టణంలోని నీళ్ల కుంట గ్రామంలో బుధవారం జరిగిన గంగమ్మ జాతరకు హాజరైన తెలుగుదేశం పార్టీ నాయకులకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో నాయకులు ఆర్బిసి కుట్టి, గిరిబాబు, నాగరాజు, మదన్మోహన్, చిన్ని, సుబ్రహ్మణ్యం, సుధాకర్, కష్ణారెడ్డి, చెన్నరాయప్ప, భాస్కర్, రవి, గంగవరం నాయకులు గిరిధర్ గోపాల్, మురళి పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని జక్కిదొన పంచాయతీ వంటిల్లు గ్రామం వినాయకస్వామి విగ్రహప్రతిష్ట, కుంభాభిషేకం వైభవంగా జరిగింది. బుధవారం వేదపండితుల సమక్షంలో వినాయకస్వామి వారి విగ్రహప్రతిష్ట చేసి భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం ఈ కార్యక్రమానికి వచ్చిన భక్తులకు అన్నదానం నిర్వహించారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణంలోని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోజా ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా గర్భిణులకు బుధవారం ఉచితంగా పౌష్టికాహారం పంపిణీ చేశారు. పౌష్టికాహారంలో వెజ్ బిర్యానీ, చెట్ని, రైతా, అప్పడాలు, బార్బీ చిక్కీలు, కోడిగుడ్డు, అరటిపండు అందిం చారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, హాస్పిటల్ సూపరింటెండెంట్, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి-రొంపిచెర్ల: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన బుధవారం తిరుపతి -మదనపల్లి జాతీయ రహదారిలో చోటు చేసుకుంది. రొంపిచెర్ల సివిల్ సప్లైస్ గోడౌన్‌లో హమాలీగా పని చేస్తున్న సుగ్రిశెట్టి లక్ష్మీనారాయణ సొంతపనులపై తిరుపతి వెళ్లి ద్విచక్రవాహనంలో తిగిరి వస్తుండగా చిన్నగొట్టిగల్లు మండలం, భాకరాపేట కనుమదారిలో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ప్రమాదంలో లక్ష్మీనారాయణకు తలకు బలమైన గాయం తగలడంతో అక్కడికక్కడే మతి చెందాడు. మతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గోడౌన్‌లో హమాలీగా పనిచేస్తూ రోడ్డు ప్రమాదంలో మతి చెందిన లక్ష్మీనారాయణ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

టిప్పర్ ఢీకొని వ్యక్తి...

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ద్విచక్ర వాహనాన్ని టిప్పర్ ఢీకొన డంతో ఓ వ్యక్తి మతి చెందిన సంఘటన మండలంలోని మహాసముద్రం టోల్ ప్లాజా వద్ద బుధవారం చోటు చేసుకున్నది. ఏఎస్ఐ మల్లప్ప ఇచ్చిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తోంపాయనపల్లికి చెందిన ప్రభాకర్, ఆయన కుమార్తె శృతిని తీసుకుని చిత్తూరుకి ద్విచక్ర వాహనంలో వెళుతుండగా బెంగళూరు నుంచి చిత్తూరుకు వెళ్తున్న టిప్పర్ ఢీకొన్నది. ఈ సంఘటనలో ఇరువురికి గాయాలు కాగా చిత్తూరు ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం ప్రభాకర్ పరిస్థితి విషమంగా ఉండడంతో వేలూరు సీఎంసికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్టు ఎఎస్ఐ తెలిపారు.

అక్రమ మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: అక్రమ మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు స్పెషల్ ఎంఫోర్స్మెంట్ డైరెక్టర్ సిఐ చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం మండలంలోని మొగిలివారిపల్లి గ్రామం చెందిన వెంకట చలపతి నాయుడు కర్ణాటక మద్యంను గోని సంచిలో వేసుకొని తరలిస్తుండగా అతన్ని అదుపులో తీసుకుని కేసు నమోదచేసి కోర్టుకు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈదాడుల్లో ఎస్సై మోహన్ బాబు, హెడ్ కానిస్టేబుల్ కష్ణయ్య, సుబ్రహ్మణ్యం గౌడ్, వెంకటేశులు, కిరణ్, మమత, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి రాయబార మహోత్సవం

ప్రజాశక్తి-సోమల: మండలం కమ్మపల్లి గ్రామంలోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో జరుగుతున్న కార్యక్రమాలలో భాగంగా ఏడవ తేదీ బుధవారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారి ఉత్సవ విగ్ర హాలకు 108 కళశాలలోని ఏకాదళ ఫల రసములతో అభిషేకం నిర్వహించారు. ఉదయం 6.30 గంటలకు విష్ణు సహస్ర పారాయణం, మంత్రపుష్పం, నిత్య హోమ బలిహరణ చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులకు అభిషేకం నిర్వహించారు. రాత్రి ఎనిమిది గంటలకు శ్రీవారి రాయబార మహోత్సవం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కోట: పట్టణంలోని ముస్లిం వీధికి చెందిన కీర్తి శేషులు టైలర్ కాలేషా సతీమణి మరణించింది. ఆమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. తీవ్ర అస్వస్థతకు గురై మంగళవారం సాయంత్రం ఇంటి వద్ద మృతి చెందారు. ఈ క్రమంలో పలువురు టీడీపీ నాయకులు బుధవారం ఉదయం మతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం నాయకులు కొద్దిసేపు కుటుంబసభ్యులతో మాట్లా టడి వారికి మనో ధైర్యం చెప్పారు. అనంతరం తిరుపతి పార్లమెంట్ మైనారిటీ అధ్యక్షులు షేక్ జలీల్ అహ్మద్ అంతిమ సంస్కార ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ తిరుపతి జిల్లా బీసీ సెల్ కార్యదర్శి తీగల సురేష్ బాబు, టీడీపీ కోట పట్టణ అధ్యక్షులు షేక్ షంషుద్దీన్, గూడూరు నియోజకవర్గం మైనారిటీ సెల్ ఉపాధ్యక్షులు షేక్ నౌషాద్, కోట బిట్-1 ఎంపీటీసీ దారా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ సేవలో బొజ్జల బృందమ్మ



ప్రజాశక్తి-తొట్టంబేడు: తొట్టంబేడు పంచాయతీలోని పాతూరు జాతర లో భాగంగా బుధవారం గంగమ్మను బొజ్జల బృందమ్మ దర్శించుకు న్నారు. జాతర నిర్వాహకులు ఆమెకు స్వాగతం పలికి దర్శన ఏర్పా ట్లు చేశారు. అనంతరం ఆమె అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో, పాడి పంటలతో విరజిల్లాలని ఆమె గంగమ్మ తల్లిని వేడుకున్నట్లు తెలిపారు. అనంతరం ఆమె తెలుగుదేశం పార్టీ నాయకులు బాలసుబ్ర మణ్యం ఇంటిదగ్గర తేనేటి విందును స్వీకరించారు. కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గాలి మురళి నాయుడు, బీసీ సెల్ నాయకులు భీమాల భాస్కర్, మాజీ పాల సొసైటీ ఛైర్మన్ రావిళ్ళ ముని రాజా నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శ్రీసిటీ సందర్శన

ప్రజాశక్తి-వరదయ్యపాలెం: కేంద్ర ప్రభుత్వ రబ్బర్ బోర్డు ఛైర్మన్ డాక్టర్ సవార్ ధనానియా బుధవారం శ్రీసిటీని సందర్శించారు. ఆయనకు ముందుగా శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) సి.రమేష్ కుమార్ సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ మౌళిక సదుపాయాలు, ప్రగతి, ప్రత్యేకతలను ఆయనకు వివరించారు. స్థానిక సెంట్రల్ ఎక్స్‌ప్రెస్ రహదారిపై జ్ఞాన్ సర్కిల్ సమీపంలో ఇండియన్ రబ్బర్ మ్యానుఫ్యాక్చరర్స్ రీసెర్చ్ అసోసియేషన్ గుర్తింపు పొందిన ఓ స్వతంత్ర ప్రయో గశాలను డాక్టర్ సవర్ ధనానియా తనిఖీ చేశారు. ఈ ల్యాబ్ స్థానిక ఆటోమోటివ్, అనుబంధ పరిశ్రమలకు చెందిన రబ్బరు ఉత్పత్తుల నాణ్యత పరీక్షలు, విశ్లేషణ తదితర సేవలను అందిస్తుంది. పర్యటనలో డాక్టర్ సవర్ ధనానియా శ్రీసిటీ పరిసరాలను సందర్శించి, పారిశ్రామికవాడ మౌళిక సదుపాయాలను, పారిశ్రామిక కార్యకలాపాలను పరిశీలించారు. ఇక్కడ వసతులపై సంతప్తి వ్యక్తం చేసి, ప్రపంచ స్థాయి సదుపాయాలతో మెగా ఇండస్ట్రియల్ పార్కును అభివద్ధి చేసినందుకు శ్రీసిటీ యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. ఆయన అంచనా మేరకు, శ్రీసిటీలోని పరిశ్రమలు రబ్బ రు బొమ్మలు, విడి భాగాలను తయారు చేసే అధిక సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. కార్యక్రమంలో డాక్టర్ రాజకుమార్, పాల్ వన్నన్ పాల్గొన్నారు.